# అక్బరుద్దీన్‌కు ఒక న్యాయం.. అట్టడుగు పేదలకు ఇంకో న్యాయమా?

- అక్బరుద్దీన్ కాలేజీల్లో చదివే వాళ్ల జీవితాల మీకు ముఖ్యమా?
- మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వేలాది మంది పేదల జీవితాలు మీకు పట్టవా?
- కష్టపడి చెమటోడ్చి ఇండ్లు కట్టుకున్న మధ్య తరగతి ప్రజలు బతుకులు మీకు లెక్కలేవా?
- తక్షణమే అక్రమంగా నిర్మించిన అక్బరుద్దీన్ కాలేజీ భవనాన్ని కూల్చివేస్తారా? లేదా?
- లేకుంటే ప్రజల పక్షాన ఆ పని మేమే చేస్తాం
- కాంగ్రెస్ ప్రభుత్వానికి బీజేపీ స్టేట్ చీఫ్ రామచంద్రరావు అల్టిమేటం



**విశ్వంభర, హైదరాబాద్ :** పాతబస్తీ సల్కం చెరువు భూమిలో అక్బరుద్దీన్ ఒవైసీ కాలేజీ కట్టిన మాట వాస్తవమేనని, అందులో 10 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నందున వారి జీవితాలను నాశనం చేయలేమని ఇయాళ కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు అన్నాడు సోమవారం
నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామ చంద్రరావు . మాట్లాడుతూ నేనడుగుతున్నా...మూసీ పరివాహక ప్రాంతంలో, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో వేలాది మంది పేదలు, చెరువు శిఖం భూములని తెలియక డబ్బులు పెట్టి కొని ఇండ్లు కట్టుకున్న మధ్య తరగతి ప్రజల ఇండ్లను ఎందుకు కూలుస్తున్నరు. వాళ్లు మనుషులు కాదా? వాళ్లవి జీవితాలు కావా? వాళ్లకు కుటుంబాలు లేవా? అట్లాంటి వాళ్ల ఇండ్లు ఎందుకు కూలగొడుతున్నరు? వాళ్ల జీవితాలను రోడ్డు పాలేందుకు చేస్తున్నరు? అక్బరుద్దీన్ కాలేజీకి ఒక న్యాయం? పేదలకు మరో న్యాయమా? కాంగ్రెస్ మార్క్ ఇందిరమ రాజ్యమంటే ఇదేనా?..
నిజంగా అందరికీ ఒకటే న్యాయమైతే అక్బరుద్దీన్ కాలేజీ భవనాన్ని ఎందుకు కూల్చరు? గతేడాది నోటీసులిచ్చి గడువు పెట్టారు కదా? విద్యా సంవత్సరం కూడా ముగిసిన వెంటనే కూల్చివేస్తే... ఆ కాలేజీ యాజమాన్యం వేరే బిల్డింగ్ చూసుకునేది కదా? విద్యార్థులకు ప్రత్యామ్నాయ కాలేజీల్లో అవకాశం కల్పించాలి కదా? ఇవేమీ చేయకుండా అక్బరుద్దీన్ చెరువులు, పేదల భూములు, ప్రభుత్వ భూములు కబ్జా చేసినా, దాదాగిరి చేసినా, ఆఖరకు కరెంట్ బిల్లులు కట్టకపోయినా? తీవ్రవాదులకు ఆశ్రయమిచ్చినా వాళ్లకు రక్షణ కల్పిస్తామంటే చూస్తూ ఊరుకోవాలా? తక్షణమే అక్బరుద్దీన్ కాలేజీని కూల్చివేయాలి. లేకుంటే బీజేపీ ఆ పనిచేస్తుందని హెచ్చరిస్తున్నాను.ఏబీఎన్, ఆంధ్రజ్యోతి మీడియా సంస్థలపై బీఆర్ఎస్ మూకలు దాడులకు తెగబడుతున్నాయని ఇప్పుడే పోలీసుల నుండి సమాచారం వచ్చింది. బీఆర్ఎస్ నేతలు బరితెగించి వ్యవహరిస్తున్నారు. ప్రజలు ఆ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించినా బుద్ధి రాలేదు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు బీఆర్ఎస్ ను నమ్మడం లేదని గ్రహించి ఏం చేయాలో తెల్వక అత్త మీద కోపం దుత్తమీద తీసినట్లు మీడియా సంస్థలపై దాడులకు తెగబడుతున్నారు. మొన్న మహా న్యూస్ పై దాడులు చేశారు. ఇవ్వాళ ఏబీఎన్, ఆంధ్రజ్యోతి మీడియా సంస్థలపై దాడులు చేసేందుకు సిద్ధమైనారు. నేను ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా... తక్షణమే మీడియా సంస్థలకు రక్షణ కల్పించాలి. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. ఒకవేళ మీడియా సంస్థలు ఏదైనా తప్పుగా రాస్తే చట్టపరంగా, న్యాయపరంగా చర్యలు తీసుకోవాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులు చేస్తామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. అవసరమేతే మీడియా సంస్థలకు బీజేపీ రక్షణ కవచంగా నిలుస్తుంది. తక్షణమే ఏబీఎన్, ఆంధ్రజ్యోతి కార్యాలయాలకు తగిన రక్షణ కల్పించాలని ఇప్పుడే బీజేపీ యువ మోర్చా నాయకులను ఆదేశాలు జారీ చేసిన. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులను హెచ్చరిస్తున్నా...ఇకపై మీడియా సంస్థలపై, అమాయక ప్రజలపై దాడులు చేశారో ఖబడ్దార్.... మీ అంతు చూస్తాం. మీలాగే మేం ఆలోచిస్తే మీ బూతు ఛానల్ ''టీ''న్యూస్ ను ఎప్పుడో భూస్థాపితం చేసే వాళ్లం. కానీ మీడియా సంస్థలను బీజేపీ గౌరవిస్తోంది. మాకు వ్యతిరేకంగా రాసినా, కథనాలు ప్రచారం చేసినా తప్పులుంటే సరిదిద్దుకుంటాం. కావాలని తప్పుడు వార్తలు రాస్తే చట్ట, న్యాయపరంగా ముందుకు వెళతామే తప్ప దాడులు చేయబోం. ఎందుకంటే వాక్ స్వాతంత్ర్యాన్ని గౌరవించే పార్టీ బీజేపీ. అందుకే బీఆర్ఎస్ నాయకులను హెచ్చరిస్తున్నా.... మీడియా సంస్థలపై దాడులు చేశారో ఖబడ్దార్... టీ న్యూస్ అంతు చూస్తాం. 14 కోట్ల మంది బీజేపీ కార్యకర్తలు, కోట్లాది మంది నరేంద్రమోదీగ అభిమానులు తలుచుకుంటే మీరు అడుగు కూడా బయటపెట్టలేరనే సంగతిని గుర్తుంచుకోవాలని అన్నాడు.

## తెలంగాణలో క్రీడా రంగం అభివృద్ధిపై కపిల్ దేవ్ ప్రశంస

### - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం క్రీడా రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ప్రశంసించారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆయన అధికారిక నివాసంలో కపిల్ దేవ్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, క్రీడాభివృద్ధికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎం రేవంత్ రెడ్డి కపిల్ దేవ్‌కు వివరించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు తెలంగాణలో క్రీడాభివృద్ధికి సంబంధించిన అన్ని విషయాల్లో తాను భాగస్వామినవుతానని కపిల్ దేవ్ ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా దక్షిణ కొరియాతో పాటు పలు దేశాల్లో తాము సందర్శించిన క్రీడా యూనివర్సిటీలు.. అక్కడి క్రీడా ప్రముఖులతో తమ భేటీల వివరాలను సీఎం రేవంత్ రెడ్డి కపిల్ దేవ్‌కు తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

## చందనకు బంగారం



**విశ్వంభర, ఎల్బీనగర్ :** కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవాన్ని వరంగల్‌లో అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. ఈసందర్భంగా హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ కొలను చందనకు బంగారు పతకాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అందించారు.

## గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ స్వీకరణ




**విశ్వంభర, చిట్యాల :** చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు సాగర్ల సత్తయ్య తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా పీహెచ్డీ పట్టా అందుకున్నారు. సోమవారం వరంగల్ కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన విశ్వవిద్యాలయ 23వ స్నాతకోత్సవంలో సాగర్ల సత్తయ్యకు గవర్నర్ డాక్టరేట్ పట్టా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐ సి టి డైరెక్టర్ డి శ్రీనివాసరెడ్డి, విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సత్తయ్య ప్రస్తుతం తాటికల్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సత్తయ్యను పలువురు కవులు, సాహితీవేత్తలు అభినందించారు.

## గొర్రెలు, బర్రెలు ఇస్తే నేనేం చేసుకోవాలి?


**గత పదేళ్లలో నాశనమైన శాఖలనిచ్చారు**

**ఇది తన అదృష్టమో, దురదృష్టమో అర్థం కావడం లేదన్న శ్రీహరి**




**విశ్వంభర, కరీంనగర్ :** తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి తనకు కేటాయించిన శాఖలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గత పదేళ్లలో పూర్తిగా దెబ్బతిన్న శాఖలను తనకు అప్పగించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కరీంనగర్లో నిర్వహించిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు కేటాయించిన ఐదు శాఖలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వాటిని చూస్తుంటే ఇది తన అదృష్టమో లేక దురదృష్టమో అర్థం కావడం లేదని అన్నారు. పశుసంవర్ధక శాఖ మొత్తం గందరగోళంగా ఉంది. యువజన సర్వీసులు ఇచ్చి నన్నేం చేసుకోమంటారు? గొర్రెలు, బర్రెలు ఇస్తే ఏం చేసుకోవాలి? అని మంత్రి శ్రీహరి నిరాశ వ్యక్తం చేశారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## సిగాచి ప్రమాదంపైన సమగ్ర విచారణ జరపాలి



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో ఉన్న అన్ని పరిశ్రమలపై భద్రతా తనిఖీలు చేయాలని సీపీఐ మాజీ ఎంఎల్ఏ చాడ వెంకట రెడ్డి డిమాండ్‌చేశారు. సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా తో మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా కాచమైలారం వద్ద గల సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదం అత్యంత దురదృష్టకరం అని అన్నారు. సిగాచి ప్రమాదంపైనా ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు 41 మంది కార్మికులు మరణించడం ఘోర మైన ఘటన అని చాడ వెంకట్ రెడ్డి అన్నారు.ఇది పూర్తిగా మానవ తప్పిదమేనని పేర్కొన్నారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా యాజమాన్యం అధునాతనమైన పరికరాలు తీసుకు రాలేదనేది అర్థమవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక పరిశ్రమలో ఇంత మంది కార్మికులు చనిపోవడం మొదటి సారి అని చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఈ ఘటనను అనుభవంగా తీసుకొని అయిన రాష్ట్రంలోని అన్ని ఫ్యాక్టరీలపై సేఫ్టీ తనిఖీలు చేయాలన్నారు. ఈ ఘటనపై సమగ్రమైన విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు చూస్తాయని ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు. సిగాచి ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు సంతాపాన్ని వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## నేడు మఖన్‌లాల్ చతుర్వేది జర్నలిజం యూనివర్సిటీ పాలకమండలి సమావేశం

### తెలంగాణ నుంచి హాజరవుతున్న సీనియర్ జర్నలిస్ట్ రావికంటి శ్రీనివాస్



విశ్వంభర, హైదరాబాద్: మధ్యప్రదేశ్ లోని ప్రఖ్యాత మఖన్‌లాల్ చతుర్వేదీ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ యూనివర్సిటీ అత్యున్నత పాలకమండలి సమావేశం మంగళవారం భోపాల్ లో జరగనుంది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అధ్యక్షతన ఆయన నివాసం సమత్వ భవన్‌లో సాయంత్రం నాలుగు గంటలకు ఈ సమావేశం జరగనుంది. భారత ఉపరాష్ట్రపతి ఈ విశ్వవిద్యాలయానికి విజిటర్‌గా ఉన్నారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి విశ్వవిద్యాలయ జనరల్ కౌన్సిల్ , మేనేజ్‌మెంట్ కమిటీకి ఛైర్మన్. జనరల్ కౌన్సిల్ విశ్వవిద్యాలయానికి అత్యున్నత విధాన నిర్ణాయక మండలి. ఇది విద్య, పరిపాలన కార్యక్రమాలను మార్గనిర్దేశనం చేస్తుంది. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్, ఎడిటర్స్ గిల్డ్ ప్రతినిధి, ప్రముఖ ఐటీ నిపుణులు, దేశంలని పలు రాష్ట్రాలకు చెందిన ప్రఖ్యాత వ్యక్తులు ఈ కౌన్సిల్‌లో సభ్యులుగా ఉన్నారు. తెలంగాణ నుంచి సీనియర్ జర్నలిస్ట్ రావికంటి శ్రీనివాస్ ఈ కౌన్సిల్‌లో సభ్యులుగా ఉన్నారు. ఇటీవల పునర్ వ్యవస్థీకరించిన కౌన్సిల్‌లో ఆయనకు రెండోసారి అవకాశం కల్పించారు. మంగళవారం జరగనున్న ఈ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరవుతున్నారు.

**ఆసియాలోనే మొదటి జర్నలిజం యూనివర్సిటీ..**

మఖన్‌లాల్ చతుర్వేదీ జాతీయ జర్నలిజం , కమ్యూనికేషన్ విశ్వవిద్యాలయం 34 సంవత్సరాల క్రితం ఏర్పాటైంది. ఇది మాస్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ మీడియా, జర్నలిజం, ప్రకటనలు, పబ్లిక్ రిలేషన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, న్యూ మీడియా, లైబ్రరీ & ఇన్ఫర్మేషన్ సైన్స్, కమ్యూనికేషన్ రీసెర్చ్ మరియు మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌లో నాయకత్వం వహిస్తున్న సంస్థగా పేరుగాంచింది.మధ్యప్రదేశ్ ప్రభుత్వం 1990లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయానికి కవీంద్రుడు, సాహితీవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ మఖన్‌లాల్ చతుర్వేదీ గారి పేరును పెట్టారు. ఇది ఆసియా ఉపఖండంలోనే కమ్యూనికేషన్, మీడియా, ఐటీ రంగాలలో ప్రొఫెషనల్స్‌ను అభివృద్ధి చేసే మొట్టమొదటి విద్యా కేంద్రం. ఇక్కడ ప్రాచీన , ఆధునిక కమ్యూనికేషన్ పద్ధతుల ద్వారా నేటి మీడియా అవసరాలకు అనుగుణంగా విద్యను అందిస్తున్నారు. విశ్వవిద్యాలయానికి భోపాల్‌లో రెండు క్యాంపసులు, దాటియా, ఖండ్వా, రేవాలో మూడవ క్యాంపసులు ఉన్నాయి. ఈ విశ్వవిద్యాలయం యూజీసీ 2ఎఫ్ మరియు 12(బి) సెక్షన్ల ప్రకారం గుర్తింపు పొందింది. నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ ఈ విశ్వవిద్యాలయానికి బి గ్రేడ్ మంజూరు చేసింది.మీడియా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ తాజా ధోరణులకు అనుగుణంగా, విశ్వవిద్యాలయం జర్నలిజం, బ్రాడ్‌కాస్ట్ జర్నలిజం, ప్రకటనలు , పబ్లిక్ రిలేషన్స్, ఎలక్ట్రానిక్ మీడియా, న్యూ మీడియా, సినిమా స్టడీస్, కంప్యూటర్ అప్లికేషన్స్, మీడియా బిజినెస్ మేనేజ్‌మెంట్ , లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, కమ్యూనికేషన్ రీసర్చ్ వంటి విభాగాలలో పీజీ, యూజీ, నైపుణ్య ప్రాతిపదికన డిప్లొమా కోర్సులు నిర్వహిస్తుంది. ఉద్యోగోన్నతికి అనుకూలంగా ఉన్న అనేక కొత్త కోర్సులను ప్రారంభించిన తొలి విద్యాసంస్థగా యూనివర్సిటీ గుర్తింపు పొందింది. పరిశ్రమకు అనుగుణంగా విద్య, శిక్షణ మరియు అభ్యాస పద్ధతులపై ఈ విశ్వవిద్యాలయం ప్రత్యేక దృష్టి పెట్టింది. 2021 నుంచి యూజీ ప్రోగ్రామ్‌లలో నూతన జాతీయ విద్యా విధానం ను అమలు చేసిన మొదటి విశ్వవిద్యాలయం ఇదే. విద్యార్థులు ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ ద్వారా తమకు ఇష్టమైన సబ్జెక్టులను అధ్యయనం చేసే అవకాశం పొందుతున్నారు. మీడియా, లైబ్రరీ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో పరిశోధన ద్వారా పీ హెచ్‌డీ అందించడంలో విశ్వవిద్యాలయం ప్రశంసలు అందుకుంటోంది. ఎంసీయూ అనేది మీడియా , ఐటీ రంగాల్లో నిపుణులు , విద్యావేత్తల సమన్వయం. ఈ రోజు దేశంలోని దూర గ్రామీణ ప్రాంతాలకు కూడా ఈ విశ్వవిద్యాలయం 1500 కంటే ఎక్కువ ఐటీ , 40 మీడియా అనుబంధ స్టడీ ఇన్‌స్టిట్యూట్స్ ద్వారా విద్యను అందిస్తోంది. ప్రతి సంవత్సరం లక్షకు పైగా విద్యార్థులు ఈ విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ ప్రోగ్రామ్‌లలో చదువుతున్నారు. ఇది విశ్వవిద్యాలయ విజయాన్ని, విశ్వసనీయతను, ప్రాచుర్యాన్ని, గుర్తింపును సూచించేది.విశ్వవిద్యాలయం అధ్యాపకులు వారి సృజనాత్మక దృక్పథం, పరిశోధన, నిబద్ధతకు ప్రసిద్ధులు. చాలా మంది అధ్యాపకులు పీహెచ్‌డీ.తో పాటు శక్తివంతమైన పరిశోధనలు చేస్తున్నారు. విద్యార్థులతో సులభంగా కలిసిపోతూ, స్ఫూర్తినిచ్చే పద్ధతిలో బోధన నిర్వహిస్తున్నారు. విద్యార్థుల కలలు, ఆశయాలను అంతర్జాతీయ అవకాశాలుగా మారుస్తూ, వారిని విజయపథంలో నడిపించడమే విశ్వవిద్యాలయ లక్ష్యం. మాజీ విద్యార్థులు ప్రముఖ ప్రింట్ మీడియా సంస్థలు, ఛానెల్స్, డిజిటల్ మీడియా, అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు, పబ్లిక్ రిలేషన్స్ సంస్థలు, గ్రాఫిక్ డిజైనింగ్, మల్టీమీడియా, ఐటీ, లైబ్రరీ , కంప్యూటర్ రంగాలలో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. విశ్వవిద్యాలయంలో "కర్మవీర కమ్యూనిటీ రేడియో", ఆడియో, విజువల్ స్టూడియో, ఎడిటింగ్ ల్యాబ్స్ , డిజిటల్ ల్యాబ్ వంటి ఆధునిక వసతులు ఉన్నాయి. అందువల్లే మీడియా, కమ్యూనికేషన్, లైబ్రరీ, మీడియా మేనేజ్‌మెంట్, ఐటీ విద్యలో దేశవ్యాప్తంగా మఖన్‌లాల్ చతుర్వేది యూనివర్సిటీ మొదటి ఎంపికగా మారింది.

## ఘనంగా కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం




విశ్వంభర, హనుమకొండ: కాకతీయ విశ్వవిద్యాలయం 23వ స్నాతకోత్సవం సోమవారం హనుమకొండలో వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ , కాకతీయ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై పట్టభద్రుల్ని అభినందించారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ''స్నాతకోత్సవం అనేది ముగింపు కాదు, జీవితంలో ఒక కొత్త అధ్యాయానికి ప్రారంభం'' అని పేర్కొన్నారు. భారత పూర్వ రాష్ట్రపతి ఏ.పి.జే. అబ్దుల్ కలం చెప్పిన మాటలను స్మరించుచేసారు. ఉత్తర తెలంగాణాలో కాకతీయ విశ్వవిద్యాలయం ఒక మహత్తర విద్యా కేంద్రంగా ఎదుగుతోందని, న్యాక్ ఏ+ గ్రేడ్, ఎన్ఐఆర్ఎఫ్‌లో 151-200 బ్యాండ్, యూఐ గ్రీన్ మెట్రిక్‌లో మూడో స్థానం, ఫార్మసీ కళాశాలకు 84వ ర్యాంకు లభించడం విశేష విజయాలని తెలిపారు. ఈ విజయాల వెనుక ఉన్నతస్థాయి అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థుల కృషి ఉందన్నారు. జాతీయ విద్యా విధానం 2020ను అనుసరిస్తూ విశ్వవిద్యాలయంలో కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, న్యూట్రిషన్ సైన్స్ వంటి కొత్త కోర్సులు ప్రారంభించడం అభినందనీయం అని అన్నారు. విద్యార్థులు జీవితంలో కూడా సేవ చేసే మనోభావంతో ముందుకెళ్లాలని గవర్నర్ పిలుపునిచ్చారు.
శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్ డా. డి. శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గ్రామీణ నేపథ్యం లేదా తెలుగు మాధ్యమం విజయానికి అడ్డంకి కాదని స్పష్టం చేస్తూ, తమ విజయానికి కారణమైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మిత్రులకు విద్యార్థులు కృతజ్ఞతగా ఉండాలని సూచించారు.
కేవలం జ్ఞానం ఉండటం సరిపోదని, దానిని ఎలా ఉపయోగించాలో తెలిసి ఉండాలన్నారు. తక్కువ ఖర్చుతో మందుల తయారీ, దేశీయ టీకా అభివృద్ధి, పర్యావరణ హిత న్యాప్కిన్లు తయారీ, వ్యర్థాల నిర్వహణలో ఐసీటీ చేసిన కృషిని వివరించారు. "మంచి వ్యక్తిగా ఎదగాలంటే వినయం ఉండాలి, మూలాలను మరవకూడదు" అని హితవు పలికారు.
వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, గోల్డెన్ జుబిలీ సంవత్సరం సందర్భంగా స్నాతకోత్సవం జరగడం గర్వకారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.144 కోట్ల బ్లాక్ గ్రాంట్, రూ.50 కోట్ల అదనపు గ్రాంట్‌తో మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయం డ్రగ్ ఫ్రీ క్యాంపస్‌గా రూపుదిద్దుకుంటోందని, సైబర్ సేఫ్టీ, యాంటీ ర్యాగింగ్, రక్తదాన శిబిరాలు, వన మహోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పారా ఒలింపిక్ పతక విజేత విద్యార్థిని సఫలతను, ఫార్మసీ, పొలిటికల్ సైన్స్ విభాగాల అలుమ్ని కృషిని కొనియాడారు.

**పట్టాలు, గోల్డ్ మెడల్స్ పంపిణీ..**

ఈ కార్యక్రమంలో మొత్తం 446 గోల్డ్ మెడల్స్, 374 మంది పీహెచ్డీ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. పాలక మండలి సభ్యులు, పూర్వ ఉపకులపతులు, డీన్‌లు, సెనేట్ సభ్యులు, అలుమ్ని, గోల్డ్ మెడల్ దోనర్లు, విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, ఆహ్వానితులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో మెరిసిన తార



**విశ్వంభర, నిజామాబాద్ :** నిజామాబాద్‌లో ఏకాధి సిల్వర్ జ్యువెలరీ కొత్త షోరూమ్‌ని ప్రముఖ నటి, టెలివిజన్ హోస్ట్ అనసూయ భరద్వాజ్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తో కలిసి నిజామాబాద్‌లో ఏకాధి సిల్వర్ జ్యువెలరీ యొక్క షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అనసూయ భరద్వాజ్ మాట్లాడుతూ, "వారసత్వం, హస్తకళను ప్రోత్సహించే వాటిలో భాగం కావడం ఎల్లప్పుడూ సంతోషాన్నిస్తుంది. ఏకాధి సిల్వర్ జ్యువెలరీ సంప్రదాయం, ఆధునిక డిజైన్‌ల యొక్క ఖచ్చితమైన సమ్మేళనాన్ని అందిస్తోంది, ఇది వెండి ఆభరణాల ప్రియులందరికీ వన్‌స్టాప్ గమ్యస్థానంగా మారుతుంది." అని అన్నారు.
"లాంచ్‌ను పురస్కరించుకుని, ఏకాధి సిల్వర్ జ్యువెలరీ ప్రత్యేకమైన ఆషాడం పండుగ ఆఫర్‌లను అందిస్తోంది, ఇది పరిమిత కాలానికి చెల్లుబాటు అవుతుంది. కస్టమర్‌లు చేతితో తయారు చేసిన వెండి ఆభరణాలు, బహుమతి వస్తువులు, పూజా వస్తువులు, మరిన్నింటిని ఆకర్షణీయమైన ధరలలో అందుబాటులో ఉన్నాయి" అని ఫ్రాంఛైజర్ సంతోష్ అన్నారు.
“రాజమండ్రి మరియు హైదరాబాద్‌లోని తమ స్టోర్‌లు ఘనవిజయం సాధించిన తర్వాత, భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న లగ్జరీ వెండి ఆభరణాల బ్రాండ్ ఏకాధి తన మూడవ స్టోర్‌ను నిజామాబాద్‌లో ప్రారంభించడం ఆనందాన్ని ఇస్తుందని ఏకాధి రాచకొండ డైరెక్టర్ వేణు తెలిపారు.

## ఈ నెల 14 నుండి కరెంటోళ్ల నిరవధిక సమ్మె

### సమ్మెపై స్పందించాలని డిప్యూటీ సీఎంకు వినతులు



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** విద్యుత్‌శాఖ లో మరో సారి సమ్మె హారన్ మోగనుంది. ఈ నెల 14 ఉదయం 6.00 గంటల నుండి కరెంటోళ్ల నిరవధిక సమ్మెకు పూనుకోనున్నారు. ఆర్టిజన్స్‌ను కన్వర్షన్‌చేయాలని, ఒకే సంస్థ, ఒకే సర్వీస్‌రూల్స్ అమలు డిమాండ్‌తో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్‌కన్వర్షన్‌జేఏసీ ఈ మేరకు విద్యుత్ శాఖ నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఒక వైపు కేంద్ర ప్రభుత్వం విద్యుత్‌సంస్థల ప్రైవేటీకరణ దిశగా పలు రాష్ట్రాలలో ముందుకు వెళుతోందని, దీనికి కొనసాగింపుగా అన్నట్లు తెలంగాణ రాష్ట్రంలోనూ ఆర్టిజన్‌ఉద్యోగుల సమస్యలకు ఏ మాత్రం స్పందించకుండా అధికారులను అప్రమత్తం చేస్తు ఉన్నతాధికారుల ఫోన్‌నెంబర్లను వినియోగదారుల చెంతకు చేరుస్తున్నారని యూనియన్‌సంస్థలు మండిపడుతున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి ఆర్టిజన్‌ఉద్యోగుల కన్వర్షన్‌విషయంలో సహకారం అందించాలని డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కోరుతున్నారు.



**నాదర్గుల్ గ్రామంలోని ఎనిమిదో వార్డ్ లో మందకృష్ణ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గూడపు ఇంద్రసేన మాజీ కార్పొరేటర్, వంక ప్రభాకర్, కండగట్ల రవి, వంగ ఉపేందర్, ప్రవీణ్, టింకు, రాజు, రాము, యాదగిరి, కార్యకర్తలు పాల్గొన్నారు.**

**- విశ్వంభర, ఆదిబట్ల**